ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 16 జూన్ 2025

మహిళా సంఘాలకూ..

ముఖ హాజరు..

పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట

- సమావేశాలు తప్పనిసరి
- సంఘాల అభివృద్ధికి దోహదం

పుట్టపర్తిరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మహిళాప్రభుత్వం స్వయం సహాయక (డ్వాక్రా) సంఘాలకూ ముఖ హాజరు తప్పనిసరి చేసింది. సంఘాల నిర్వహణలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నిర్ణయం తీసుకుంది. సమావేశాల నిర్వహణకు సాంకేతికను జోడించింది. దీంతో ప్రతి సంఘం తప్పనిసరిగా నిర్వహించాల్సిందే. గ్రామ సమైక్యల పరిస్థితి కూడా అంతే. సమావేశంలో పాల్గొన్నట్లు సభ్యులు ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో ముఖ హాజరు వేయాలి. దీంతో అక్రమాలకు తావులేకుండా పోతుందనీ, సమావేశాలు నిర్వహించడం ద్వారా అభివృద్ధి సాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో చాలా సంఘాలు సమావేశాలు నిర్వహించేవి కాదని తెలుస్తోంది. సంఘంలో లావాదేవీలు తెలిసే అవకాశం లేక అక్రమాలకు ఆస్కారం ఏర్పడేది. ఆ ఆస్కారం లేకుండా ప్రభుత్వం ముఖ హాజరును తీసుకొచ్చింది.

యాప్‌లో నిక్షిప్తం

మహిళా స్వయం సహాయక సంఘాలు సమావేశాలు నిర్వహించకపోయినా.. రికార్డుల్లో చేసేవారు. సభ్యులు సమావేశానికి రాకపోయినా.. హాజరైనట్లు నమోదు చేసేవారు. వాటికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం ముఖ హాజరును అమలులోకి తెచ్చింది. గ్రామ సమైక్య, స్వయం సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించే సమయంలో కచ్చితంగా ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో నమోదు చేయాలి. సమావేశం నిర్వహించే స్థలం వివరాలు తొలుత నమోదుచేయాలి. వంద మీటర్లలోపే సమావేశం నిర్వహించాలి, లేకుంటే యాప్ లోకేషన్ తీసుకోదు. ఒక్కో సభ్యురాలి ఫొటో మూడు కోణాల్లో ముఖం, పూర్తి ఫొటో తీసి యాప్‌లో పొందుపరచాలి. సభ్యులు సమావేశానికి వస్తేనే హాజరు నమోదవుతుంది. సమావేశాలకు సీసీలు గానీ, ఏపీఎంలుగానీ హాజరుకావాలి. ఈ ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైంది. యాప్ ఎప్పట్నుంచో ఉన్నా.. సభ్యుల వివరాల నమోదు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 1,311 గ్రామ సమాఖ్యలున్నాయి. వాటి పరిధిలోని 32,868 సంఘాల్లో 3,28,680 మంది సభ్యులున్నాయి. ఇప్పటివరకు 22,699 సంఘాల ఫేషియల్ రికగ్నిషన్ పూర్తి చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. మిగతా వాటిని కూడా పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



మహిళాసంఘం సమావేశం (ఫైల్)

అభివృద్ధికి ఊతం..



ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను జోడించడం కారణంగా సంఘాల సమావేశాలు కచ్చితంగా నిర్వహిస్తారు. తద్వారా సంఘాలు అభివృద్ధి చెందుతాయి. మహిళలు అందరూ సమావేశాల్లో పాల్గొనడం ద్వారా ఒకరికొకరు సలహాలు, సమీక్షలు చేసుకుంటారు. తద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుంది.

-నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

రేపటి నుంచి

కేంద్ర కమిటీల పర్యటన

- నేషనల్ వాటర్ అవార్డ్స్, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీల రాక
- అధికారులతో డ్వామా పీడీ సమీక్ష

7

హత్యకేసులో నిందితుడి అరెస్టు

- మరొకరితో చనువుగా ఉందని ప్రియురాలి హత్య
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రియురాలు మరొకరితో చనువుగా ఉందని, నిత్యం ఫోన్లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకుని ఆమెను హత్యచేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ విజయ్‌కుమార్‌తో కలసి అరెస్టు వివరాలను వెల్లడించారు. గాండ్లపెంట మండలం సాదులవాండ్లపల్లికి చెందిన అంజనేయలు, సరస్వతి (35) దంపతులు. మనస్పర్థలు రావడంతో కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈదశలో తన ఇద్దరు కుమారులతో బతుకు తెరువు కోసం ఎనిమిదేళ్ల కిందట తలుపులకు వచ్చింది. స్థానికంగా బేల్దారి పనిచేస్తున్న వివాహితుడు సికందర్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. సరస్వతి ఇటీవల మరొకరితో గంటల తరబడి ఫోన్లో చనువుగా మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న సికిందర్ గొడవపడ్డాడు. ఏప్రిల్ 22న సరస్వతి పిల్లలు కదరిలో పంక్షన్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన సికిందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సరస్వతితో గొడవపడి నైలాన్‌దారంతో గొంతుకు బిగించి హత్యచేశాడు. అదేరోజు మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి తలుపుల గండిరోడ్డు సమీపంలో గల జమ్ముగడ్డవంక గడ్డకింద పూడ్చివేసి రాళ్లు పేర్చేశాడు. తనపై అనుమానం రాకుండా సరస్వతి ఇంటికి వస్తూపోతుండేవాడు. నెలన్నరదాటినా తల్లిజాడ కనిపించకపోవడంతో పెద్దకుమారుడు తలుపుల పోలీసు స్టేషన్లో ఫిర్యాదుచేశాడు. మిస్సింగ్ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ కేసును దర్యాప్తు చేయాలని డీఎస్పీ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. విచారణ చేపట్టిన పోలీసులు సికిందర్‌ను అనుమానితుడిగా భావించి గాలింపు చర్యలు చేపట్టారు. అతడు రాజంపేట వద్ద ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు వెళ్లారు. పసిగట్టిన నిందితుడు సికిందర్ నేరం అంగీకరించి తలుపుల తహసీల్దార్ వద్ద లొంగిపోయాడన్నారు. సమావేశంలో డీఎస్పీ విజయ్‌కుమార్, తలుపుల ఎస్‌ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు

పాఠశాల వద్దే ట్రాన్స్‌ఫార్మర్



ఆర్డీటీ పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్నట్రాన్స్‌ఫార్మర్

ధర్మవరంరూరల్, జూన్15(ఆంధ్రజ్యోతి):మండలంలోని నడిమిగడ్డపల్లిలో పాఠశాల వద్దే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను అర్థాంతరంగా ఆపేశారు. దీంతో పక్కనే ఉన్న ఆర్డీటీ స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలకు వెళ్లే మెట్ల వద్దనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం ఆందోళన రేపుతోంది. మెట్లకు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భూమిలోకి వెళ్లే ఇనుపకడ్డీ ఉంది. అది తగిలినా పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అప్పుడప్పుడూ ఓల్టేజీ సమస్యలు తలెత్తినపుడు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు వస్తాయని స్థానికులు చెబుతున్నారు. పాఠశాలకు సెలవులు వదిలినపుడు పాఠశాల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని గ్రామస్థులు.. ట్రాన్స్‌కో అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పాఠశాల వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకి మార్చాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐదేళ్లు దాటితే

బదిలీనే..

సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్‌కు మార్గదర్శకాలు

- సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి
- సిఫార్సుల కోసం పరుగులు





వార్డు సచివాలయం

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. బదిలీల అనంతరం ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో వచ్చేనెల 10లోపు పొందుపరచాల్సి ఉంది. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఈ ఏడాది మే 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేస్తారు. ఉద్యోగుల హేతబద్ధీకరణతో పాటు బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా మార్గదర్శకాలు జారీచేసింది. సచివాలయ ఉద్యోగుల హేతబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇచ్చింది. అందుకు క్లస్టర్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. పట్టణాలు, పల్లెల్లో రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. జనాభా నిష్పత్తిని బట్టి ఆరుగురు, ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా మూడు కేటగిరీలుగా విభజించింది. క్లస్టర్ పరిధిలో సిబ్బంది హేతబద్ధీకరణను ప్రామాణికంగా తీసుకున్నారు. సర్వేయర్ ఒక సచివాలయంలో ఉంటే అదే క్లస్టర్‌లోని మరో దాంట్లోనూ విధులు నిర్వహించాలి. సర్వేయర్‌లేని సచివాలయాలకు కొత్త పోస్టింగ్ ఇప్పట్లో లేదు. సదరు క్లస్టర్ పరిధిలో సర్వేయర్ రెండు (మిగతా 7లో...)

వైసీపీ నాయకుల ఓవరాక్షన్

- నిందితుడి కోసం హంగామా
- కార్యకర్తలను రెచ్చగొట్టి
- పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన వైనం

కదిరి/గాండ్లపెంట, జూన్15(ఆంధ్రజ్యోతి): గాండ్లపెంట మండలంలోని నీరుకుంట్లపల్లి వద్ద శిలాఫలకాన్ని ధ్వసం చేసిన కేసులో నిందితుడు, మాజీ ఎంపీపీ జగన్మోహన్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో వైసీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. నిందితుడిపై అక్రమ కేసులు పెట్టారనీ, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ నాయకులు కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద ఆదివారం హంగామా చేశారు. శిలాఫలకాన్ని ధ్వసంచేసిన కేసులో మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకుడు జగన్మోహన్‌తో పాటు మరికొంతమందిని నిందితులుగా చేర్చారు. జగన్మోహన్‌ను పోలీసులు ఆదివారం తీసుకొచ్చి విచారణ చేపట్టారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. వైసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన నాయకులు.. అక్రమ కేసులు పెట్టి వైసీపీ నాయకులను అరెస్టు చేశారంటూ ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు. తాము స్టేషన్‌కు వెళ్తున్నామనీ, వచ్చేవారు రావాలంటూ వైసీపీ నాయకులు రెచ్చగొట్టినట్లు సోషల్ మీడియాలో బహిర్గతమైంది. 50మందికిపైగా కార్యకర్తలు, నాయకులు స్థానిక రూరల్ సర్కిల్ స్టేషన్‌ను వెళ్లి సీఐ నాగేంద్రతో వాగ్వాదానికి దిగారు. ఓ కేసులో నిందితుడిని విచారిస్తున్నామని సీఐ నాగేంద్ర చెప్పారు. దీంతో వైసీపీ నాయకులు చేసేదిలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.



రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తల హంగామా

కేసు నమోదు

గాండ్లపెంట మండలంలోని నీరుకుంట్లపల్లిలో ఇటీవల ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 11న టీడీపీ చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలపై శిలాఫలకం ఏర్పాటు చేశారు. దానిని 11వ తేదీన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. ఈనెల 13న రాత్రి 8 గంటల సమయంలో వంకలోపల్లికి చెందిన మాజీ ఎంపీపీ జగన్మోహన్, నీరుకుంట్లపల్లికి చెందిన బావా.. శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈవిషయంపై ఎంపీడీఓ వెంకటారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన జట్లతో అసోసియేషన్ నాయకులు

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ జిల్లా జూనియర్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాల, బాలికల నుంచి జట్లను ఎంపిక చేశామన్నారు. వీరు త్వరలో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ట్రెజరర్ శేఖర్, కార్యదర్శి మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

త్రిపాత్రాభినయం

- డిజిటల్ అసిస్టెంట్‌కు అదనపు బాధ్యతలు
- ఆధార్ సేవలకు ఆటంకం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

అమడగూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకలు పొందాలంటే ప్రతిఒక్కరు ఆధార్‌కార్డు కలిగి ఉండాలనేది ప్రభుత్వ ఆదేశం. అందులో భాగంగా ఇప్పటికే కార్డును పొందిన వారు అందులో లోపాలు సరిచేసేందుకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఇప్పటివరకు నమోదు కాని చిన్నారులకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు సచివాల యాల్లో అవకాశం కల్పించారు. ఈ క్రమంలో ప్రతి మండలంలో రెండు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఉండాలి. అమడగూరు మండలానికి సంబంధించి, అమడగూరు సచివాలయంలో మాత్రం ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అందులో పనిచేసేందుకు చీకిరేవులపల్లి సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్ వేశారు. ఆయన చీకిరేవులపల్లి సచివాలయం డిజిటల్ అసిస్టెంటుగా, అమడగూరు ఆధార్ సెంటర్ ఇన్‌చార్జ్‌తో గుండువారిపల్లి సచివాలయానికి ఇన్‌చార్జ్ డిజిటల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయనకు ఎక్కడికి ఏసమయంలో వెళ్లాలో, ఏపనికి ప్రాధాన్యం ఇవ్వాలో తెలియని అయోమయం నెలకుంది. మండలానికి ఉన్న ఒక ఆధార్ కేంద్రంలోను డిజిటల్ అసిస్టెంట్ పూర్తిస్థాయిలో పనిచేయలేని దుస్థితి నెలకుంది. దీంతో ఆధార్ నమోదుకు ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా కుదరకపోవడంతో కదిరి, తనకల్లు ప్రాంతాలకు వెళ్లి అక్కడ పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలానికి రెండు ఆధార్ కేంద్రాలతో పాటు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా డిజిటల్ అసిస్టెంట్లను నియమించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సచివాలయాల్లోనూ సిబ్బంది కొరత

మండలంలో పది గ్రామసచివాలయాలున్నాయి. ఇందులో మహమ్మదాబాద్, జౌకలకొత్తపల్లి సచివాలయాల్లో మాత్రం పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. మిగిలిన ఎనిమిది సచివాలయాల విషయానికొస్తే... అమడగూరులో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ లేరు. చినగానిపల్లి లో డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చీకిరేవులపల్లిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళ పోలీస్, గుండువారిపల్లిలో డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. కసముద్రం డిజిటల్ అసిస్టెంట్, మహిళ పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, తుమ్మలలో డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళ పోలీసు, పూలకుంటపల్లి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళ పోలీస్ స్థానాలు ఖాళీగా ఉండడంతో ప్రజలు సేవలు అందుకోలేకపోతున్నారు.



సిబ్బంది కొరత ఉన్న కసముద్రం సచివాలయం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఆధార్‌లో చేర్పులు, మార్పులు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. నాకు పెళ్లి అయి ఐదేళ్లు కావస్తోంది. నా భార్య అడ్రస్ మార్చాలంటే పది మార్లు ఆధార్ సెంటర్‌కు వెళ్లి ఫలితంలేక, కదిరికెళ్లి పడిగాపులు కాసి, చేయించుకోవాల్సి వచ్చింది.

-సోముశేఖర్, నిలువురాతిపల్లి

ఎంతకష్టమైనా పనిచేస్తాం



ఎంతకష్టమైనా నాకు అప్పగించిన పనిని ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాను. రెండు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ చేసే పని ఇన్‌ఛార్జీగా చేస్తున్నాను. మూడు సచివాలయాల్లో పనిచేయాలంటే చాల ఇబ్బందిగా మారింది. కాకపోతే ప్రజలకు సేవలందించేందుకు పనిభారమైనా చేస్తాను.

- అశోక్, డిజిటల్ అసిస్టెంట్

అన్నిసేవలు అందుబాటులో ఉండేలా చూస్తాం: మునియప్ప, ఎంపీడీఓ



సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలు అందుబాటులో ఉండేలా చూస్తాం. సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. అదే సచివాలయంలో పనిచేస్తే సిబ్బందితో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇన్‌ఛార్జీగా నియమించి వారి నుంచి ప్రజలకు సేవలించేలా చూస్తాం.

విద్యార్థులూ... ఎంపిక మీదే..!

- 209 కళాశాలలు, 84,988 సీట్లు మీకోసమే..
- డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఫార్మసీలో అడ్మిషన్లు
- కోర్సు ఏదైనా భవిష్యత్తుకు బాటలు
- కోర్సులు అందిస్తున్న జేఎన్టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ వర్సిటీలు
- టెక్నాలజీని జోడిస్తున్న ప్రభుత్వం
- ప్రవేశాల కల్పనకు విద్యాశాఖ కసరత్తు
- ఇప్పటికే ఈఏపీసెట్, పాలిసెట్ ఫలితాలు
- డిగ్రీ ప్రవేశాలకు త్వరలోనే షెడ్యూల్

అనంతపురం సెంట్రల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే సమయం వచ్చేసింది. అడ్మిషన్లకు కళాశాలలు సిద్ధమవుతున్నాయి. వారికోసం 209 కళాశాలలు, 84,988 సీట్లు ఎదురు చూస్తున్నాయి. సమాజంలోని వివిధ రంగాల్లోకి అడుగు పెట్టేందుకు, తనదైన ముద్రవేసుకునేందుకు విద్యార్థికి కళాశాల ఒక వేదిక అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆ అవకాశాన్ని విద్యార్థులకు కల్పించేలా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో

(మిగతా 7లో..)

ఆవు కోసం..
ప్రాణ త్యాగం..!
విద్యుత్‌షాక్ గురైన ఆవు.. తప్పించబోయి పాడిరైతు మృతి

మొరాయించిన
తిరుపతి ప్యాసింజరు
- రెండున్నర గంటలు ఆలస్యం

అనుమతుల్లేకుండా ఆందోళనలు చేస్తే చర్యలు : ఎస్పీ రత్న

బోగస్ లబ్ధిదారుల
ఏరివేతకు శ్రీకారం
ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి నోటీసులు

అప్పుల బాధతో మహిళారైతు
ఆత్మహత్య

7

క్రైం కార్నర్

ఆవుకోసం.. ప్రాణ త్యాగం..!

● విద్యుత్‌షాక్ గురైన ఆవు.. తప్పించబోయి పాడిరైతు మృతి


జూటూరు యర్రప్ప(ఫైల్)

కనగానపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మనకు ఇష్టమైనది దూరమయితే మనసులో వెలితిగా ఉంటుంది. అది వస్తువైనా, మనుషులైనా, మూగజీవాలైనా ఒకటే. కళ్ల ముందర తను సాకుతున్న ఆవు విద్యుత్‌ఘాతానికి గురై తల్లడిల్లుతుంటే కాపాడబోయి షాక్‌గురై ఓ పాడిరైతు మృతి చెందిన విషాదకర సంఘటన ఆదివారం కనగానపల్లి మండలం సీఎస్‌కోట గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన జూటూరు యర్రప్ప(65) ఆవులు మేపుతూ జీవిస్తున్నాడు. మేతకు వెళ్లిన ఆవులు ఆంథోని అనే రైతు పొలంలోకి వెళ్లాయి. గాలీవానకు నేల మీద పడిన విద్యుత్ తీగలు ఓ ఆవు కాళ్లకు తగిలాయి.


ప్రాణాలతో బయటపడిన ఆవు

వెంటనే ఆవు విద్యుదాఘాతానికి గురై తల్లడిల్లడం చూసిన యర్రప్ప దానిని కాపాడే క్రమంలో తను షాక్‌కు గురై చనిపోయాడు. స్థానికులు గమనించి విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేయించి చూడగా అప్పటికే యర్రప్ప మృతి చెందాడు. షాక్‌కు గురై బావిలో పడ్డ ఆవును రైతులు బయటికి తీశారు. యర్రప్పకు భార్య లక్ష్మీదేవితో పాటు ఐదుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళారైతు ఆత్మహత్య


సుజాతమ్మ (ఫైల్)

ఆత్మకూరు, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిదిండ్ల గ్రామానికి చెందిన మహిళా రైతు సుజాతమ్మ(55) అప్పుల బాధతో ఆదివారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సు జాతమ్మ పంటలు సాగు చూస్తూ జీవనం సాగించేది. పంటలు గిట్టుబాటు కాక నష్టపోయింది. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు రూ.5 లక్షలకు చేరాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం అం దించారు. ఈమె భర్త కొన్నేళ్ల క్రిత మరణించాడు. కుటుంబ భారం సుజాత మ్మ మోస్తుండేవారు. పిల్లలను పోషించి, వివాహాలు చేసింది. కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుజాతమ్మ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

బోగస్ లబ్ధిదారుల ఏరివేతకు శ్రీకారం

ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి నోటీసులు


పునాదికి అతికించిన నోటీసు

రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పునా ది దశలో ఉండి.. ఇంటి నిర్మాణా లు చేపట్టని ఇళ్ల లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. పదేళ్ల క్రితం నుం చి ప్రభుత్వం పట్టణంలోని నిరుపేదలకు భూమి కొనుగోలు చేసి నివాసస్థలాలను మంజూరు చేసింది. వాటిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహనిర్మాణశాఖ అనుమతులు ఇవ్వడంతో పాటు గృహనిర్మాణానికి రుణాలు కూడా ఇచ్చింది. అయితే లబ్ధిదారులు ఇంటిని పునాది దశ వరకు నిర్మించి.. ఏళ్ల తరబడి వదిలేశారు. ప్రధానంగా బినామీ పేర్లతో పొందిన నివాసస్థలాలను ఇప్పటికే రూ. లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు విక్రయించి.. సొమ్ము చేసుకున్నారు. అలాంటి బోగస్ లబ్ధిదారులను ఏరివేయడమే లక్ష్యంగా పట్టణంలోని 14 లేఅవుట్‌లలో 724 మంది లబ్ధిదారులకు నోటీసులను జారీ చేశారు. అందుబాటులో లేని వారికి ఆయా పునాదులకు ఆ నోటీసులు అతికిస్తున్నారు. ఒక్కసారిగా నోటీసులు జారీ చేయడంతో కొనుగోలు చేసిన వారు ఉలిక్కిపడి రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే నోటీసుల జారీ ప్రక్రియ చివరిదశకు చేరుకున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా వాయిదా

అనంతపురం కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు చేపట్టాల్సిన అంగన్వాడీల ధర్నాను వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నా నేపథ్యంలో అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందనీ, ఈ నేపథ్యంలోనే అధికారుల సూచనల మేరకు ధర్నాను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

ఆశాజనకంగా పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని పశువుల సంత ఆదాయం ఈవారం ఆశాజనకంగా ఉంది. గత వారంతో పోలిస్తే ఈవారం ఆదాయం మరింత పెరిగింది. గతవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో వ్యాపారులు మార్కెట్‌కు రావడం తగ్గింది. కొనుగోళ్లు మందగించాయి. ఈక్రమంలో గతవారం సంత ఆదాయం తగ్గిపోయింది. ఈవారం పశువుల సంత వ్యాపారులతో కళకలాడింది. జీవాలు పెద్ద సంఖ్యలోనే వచ్చాయి. సంత నుంచి మార్కెట్ కమిటీకి ఆదాయం పెరిగింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో 2,81,200, ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.1,50,300 మార్కెట్‌కు వచ్చింది. రెండురోజుల సంతతో రూ.4,31,500 మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

విద్యార్థులూ.. ఎంపిక మీదే..!

(5వ పేజీ తరువాయి)

డిగ్రీ, డిప్లొమో, బీటెక్, ఫార్మసీ ప్రవేశాలు కల్పిస్తోంది. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ.. కోర్సు ఏదైనా విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసేలా ఉన్న తీకరిస్తోంది. జాతీయస్థాయిలో పేరుగాంచిన జేఎన్టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ వర్సిటీలు వాటి పరిధిలో కోర్సులను అందిస్తున్నాయి. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సు ఏదైనా విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, ప్రతి కోర్సుకు టెక్నాలజీ అంశాన్ని జోడించి ఉద్యోగ, ఉపాధి కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుందని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ఇప్పటికే ఈఏపీసెట్, పాలిసెట్ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసి ర్యాంకులను ప్రకటించింది. ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలి. డిగ్రీ ప్రవేశాల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల సంఖ్య		
కోర్సు	ప్రభుత్వ	ప్రైవేట్
డిగ్రీ	13	62
బీటెక్	3	73
ఫార్మసీ	2	39
పాలిటెక్నిక్	11	6
మొత్తం	29	180
కన్వీనర్ కోటాకింద సీట్ల సంఖ్య		
డిగ్రీ	7376	28043
బీటెక్	1448	39310
ఫార్మసీ	206	3905
పాలిటెక్నిక్	2123	2574
మొత్తం	11153	73835

209 కళాశాలలు.. 84,988 సీట్లు..

జేఎన్టీయూ, ఎస్కేయూ పరిధిలోని 192 డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కళాశాలలతోపాటు 17 పాలిటెక్నిక్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 84,988 సీట్లను కేటాయించారు. బీటెక్, ఫార్మసీకి ఈఏపీసెట్, పాలిటెక్నిక్ ప్రవేశాలకు పాలిసెట్‌ను నిర్వహించి ఫలితాలను విడుదలచేశారు. డిగ్రీ అడ్మిషన్లకోసం రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో సింగిల్ మేజర్, మెయిన్ సబ్జెక్టుల ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియద్వారా విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రధానంగా రెండు సబ్జెక్టులు అభ్యసిస్తేనే డిగ్రీలో పట్టా సాధించగలరని రాష్ట్ర విద్యాశాఖ యోచిస్తోంది. మొత్తం ప్రవేశాల ప్రక్రియను వచ్చేనెలలో పూర్తిచేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

విద్యార్థులకు డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పాలిటెక్నిక్ కోర్సులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తోంది. 75 డిగ్రీ, 76 బీటెక్, 42 ఫార్మసి, 17 పాలిటెక్నిక్ మొత్తం 209 కళాశాలల్లో చదువున్న విద్యార్థులకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తోంది. బీటెక్, ఫార్మసీ నాలుగు, పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల పాటు కోర్సులు అభ్యసించాలి. కన్వీనర్ కోటాకింద ప్రవేశాలు పొందిన ప్రభుత్వ కళాశాలలోని 11,153 మంది, ప్రైవేట్ కళాశాలల్లోని 73,835 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అదనంగా కోర్సుల కాలంలో వసతి కోసం వెచ్చించే ఖర్చును స్కాలర్‌షిప్ రూపంలో ఇస్తోంది. ఒక్క జేఎన్టీయూ, ఎస్కేయూ పరిధిలోనే ప్రతి సంవత్సరం 84,988 మందికి కన్వీనర్ కోటాకింద నూతన ప్రవేశాలు కల్పిస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తోంది. జేఎన్టీయూ, ఎస్కేయూ క్యాంపస్‌లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. కోర్సుల కాలంలోనే ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు చేయించి ఉద్యోగాలకు అవసరమైన మెళుకువలు, నైపుణ్యాలను పెంపొందిస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విధిగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

టెక్నాలజీ అనుసంధానం



ఎస్కేయూ పరిధిలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ అందుబాటులో ఉన్నాయి. ప్రతి కోర్సులోనూ టెక్నాలజీని అనుసంధానించేలా ఒక సబ్జెకును జోడిస్తున్నాం. దీంతో ఆర్ట్స్, సైన్స్‌తోపాటే ఏక కాలంలో కంప్యూటర్ సైన్స్‌ను అభ్యసించవచ్చు. ఎస్కేయూ అనుబంధంగా 13 ప్రభుత్వ, 73 ప్రైవేట్ డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వీటిలో 40కి పైగా కోర్సులు ప్రవేశపెట్టి 30వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందేలా సీట్లు కేటాయించాం. డిగ్రీ చివరి సంవత్సరంలో ప్రాజెక్టులు చేసేలా ఒక సెమిస్టర్ కాలాన్ని కంపెనీల్లో శిక్షణ పొందేందుకు విద్యార్థులకు అవకాశాన్ని కల్పించాం. సమాజానికి మానవ వనరులందించే సంస్థలా ఎస్కేయూ ఎప్పటికప్పుడు విద్యార్థులకు కొత్తబాటలు వేస్తోంది.

- ప్రొఫెసర్ అనిత, ఇన్‌చార్జ్ వీసీ, ఎస్కేయూ

ఉన్నతంగా ఎంపిక చేసుకోవాలి



విద్యార్థి భవిష్యత్ విజయతీరాలకు చేరాలంటే లక్ష్యాలను ఉన్నతంగా ఎంపికచేసుకోవాలి. ఇంటర్ అనంతరం డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ఏదైనా ప్రొఫెషనల్‌గా అభ్యసించాలి. ఏ రంగంలో రాణించాలన్నా అవసరమైన పరిజ్ఞానాన్ని, మెళుకువలను పెంపొందించుకోవాలి. వీటన్నిటికి కళాశాల కీలకమైనది. ప్రవేశాలు పొందే ముందు కళాశాలలను సందర్శించి ప్రమాణాల స్థాయిని పరిశీలించాలి. కోర్సులకు అనుగుణంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నికల్, డిజిటల్, ప్లేస్‌మెంట్ స్టాటిస్టిక్స్ తదితర విషయాలు తెలుసుకోవాలి. ఉన్నత విద్యనందించి ఉద్యోగ, ఉపాధి అకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యనూతన సంస్కరణలు తీసుకువస్తోంది.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, వీసీ, జేఎన్టీయూ

అన్ని రకాల కోర్సులు అందిస్తున్నాం



సాంకేతిక యుగంలో అన్నిరంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా కోర్సులను డిజైన్‌చేసి అందిస్తున్నాం. వర్సిటీ క్యాంపస్‌లో చదివేందుకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పోటీపడుతున్నారు. పలు భాషలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో ఉండటంతో సర్వసాధారణగా కమ్యునికేషన్ స్కిల్స్ డెవలప్ అవుతున్నాయి. రిటైల్ మేనేజ్మెంట్, ఐటీ, టూరిజం, ట్రావెల్ మేనేజ్మెంట్, ఎకనామిక్స్, తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, గణితం, సైకాలజీ, మాలిక్యులర్ బయాలజి, జియోగ్రఫి, సంస్కృతం, హిందీ, మేనేజ్మెంట్, కామర్స్, కమ్యునికేషనల్ సోషల్ సైన్స్ వంటి కోర్సులను డిగ్రీ, పీజీ ద్వారా అందిస్తున్నాం. విద్యార్థులు వారి అభిరుచి మేరకు కోర్సుల్లో ప్రవేశించవచ్చు. **-ప్రొఫెసర్ కోరి, వీసీ, సెంట్రల్ వర్సిటీ**

మొరాయించిన తిరుపతి ప్యాసింజరు

● రెండు గంటలు ఆలస్యం


గూళ్యపాళ్యం స్టేషన్‌లో నిలిచిపోయిన తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు రైలు

గుంతకల్లు, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కదిరిదేవరపల్లి వెళ్లే ప్యాసింజరు (నం. 57405) రైలింజను ఆదివారం ఉదయం గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌లో మొరాయించింది. ఈ రైలు ఉదయం 7.20 గంటలకు రావాల్సి ఉండగా.. అరగంట ఆలస్యంగా వచ్చింది. ఈ స్టేషన్‌లో రైలింజన్ మొరాయించడంతో ఈ ప్యాసింజరు రైలును నిలిపివేశారు. దాదాపు రెండున్నర గంటలసేపు రైలు ఆగిపోయింది. గుంతకల్లు నుంచి ప్రత్యామ్నాయ రైలింజన్‌ను పంపడంతో ఉదయం 10.30 సమయంలో కదిరిదేవరపల్లి రైలును గుంతకల్లుకు చేర్చారు. ఈ ప్యాసింజరు కారణంగా కలబురగి-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామమోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాక్షుడిగా రామమోహన్ రెడ్డి విజయం సాధించారు. రెండేళ్లపాటు నూతన కమిటీ కొనసాగుతుంది. రామమోహన్‌రెడ్డికి ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదోతరగతిలో 80శాతం పైగా మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులు నగదు ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోవాలని తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. నగదు ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోదలచినవారు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉండాలని, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితాతో పాటు కులధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో జూలై 10వ తేదీలోపు చౌడేశ్వరిదేవి కల్యాణభవన్, విజయనగర్ కాలనీ, బెంగళూరురోడ్డు, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 8555967072, 9440878484 నెంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. గడువులోపు పంపని దరఖాస్తులను అనర్హులుగా పరిగణిస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు జూలై 24వ తేదీన చౌడేశ్వరి కల్యాణ భవన్‌లో నిర్వహించే సభలో నగదు పురస్కారాలు అందజేస్తామని వివరించాన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు ఫైనల్ రౌండ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం ఫైనల్ రౌండ్ పోటీలు అనంతపురం క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ త వారం రోజులుగా జరుగుతున్న పోటీల్లో నెల్లూరు జట్టు 12పాయింట్లతో ప్రథమస్థానంలో నిలవగా.. అనంతపురం 8 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే చిత్తూరు, కడప చెరో 6పాయింట్లతో నిలిచాయన్నారు. సోమవారం ఫైనల్ రౌండ్‌లో అనంతపురం-నెల్లూరు, కడప-కర్నూలు జట్ల మధ్య పోటీలు జరగనున్నట్లు చెప్పారు.

కరువు, ఎడారీకరణ నివారణపై రేపు సదస్సు


మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే కరువు, ఎడారీకరణకు నిలయంగా మారిన ఉమ్మడి అనంతపురం జిల్లా పరిస్థితులను కేంద్రస్థాయిలో తెలియజేసేందుకు ఈనెల 17న పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 1994 నుంచి జూన్ 17వతేదీన ప్రపంచ కరువు, ఎడారీకరణ నివారణ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో జరుపుకుంటున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నేలలు, కరువు, ఎడారీకరణ, వాతావరణంలోని మార్పులు ఆధారంగా ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. గాలి, నీరు కలుషితమైన నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమార్గమని తెలిపారు. అడవులను తలపించేలా విరివిగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, చెట్లను పరిరక్షించడం మనందరి బాధ్యత అని వివరించారు. ఈ క్రమంలోనే నిర్వహించే జాతీయ సదస్సుకు శాస్త్రవేత్తలు, ప్రముఖులు హాజరై వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సీఈఓ మురళీకృష్ణ, కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' స్టేటస్ తెలుసుకోండిలా..

కొత్తచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పిల్లలకు తల్లికివందనం పథకాన్ని వర్తించేలా నిర్ణయం తీసుకుంది. ఈ పథకాన్ని 12 వతేది అమలులోకి తెచ్చింది. శుక్రవారం నుంచే రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాలకు నగదు జమ అవుతోంది. స్మార్ట్ ఫోన్‌లో తల్లికివందనం పేమెంట్, స్టేటస్ తెలుసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ gswsnbm.ap,gov.in/N-BM/#!/ అప్లికేషన్ స్టేటస్ చెకప్‌ను తీసుకువచ్చింది. మొబైల్‌లో ఈ యాప్‌పై క్లిక్ చేయగానే ఎన్‌బీఎం అప్లికేషన్ స్టేటస్ అని చూపిస్తుంది. స్కీమ్(పథకం): తల్లికివందనం, సంవత్సరం: 2025-2026, యుఐడి: తల్లి, తండ్రి, సంరక్షుల ఆధార్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది. తరువాత స్రీన్‌పై చూపిస్తున్న అంకెలను నమోదు చేయాలి. తరువాత మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేయగానే స్కీమ్, అప్లికేషన్, పేమెంట్ వివరాలు స్క్రీన్‌పై కనబడతాయి. దీంతో పథకం వర్తించిందా లేదా అని తెలుసుకోవచ్చు. తల్లికివందనం పథకం వర్తించని, అనర్హుల జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని అధికారులకు ఈనెల 20 తేదీలోగా అర్జీలు అందజేయాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అనుమతుల్లేకుండా ఆందోళనలు చేస్తే చర్యలు : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాలు, ఆందోళనలు చేయాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ వి.రత్న సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టరాదని, 30 యాక్టు అమలులో ఉందని వివరించారు. మహిళలు, చిన్నారులతో పాటు తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరి మహిళల పట్ల జరిగే నేరాలు అరికట్టడానికి శక్తిటీంలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. శక్తియాప్ వాట్సాప్‌నెంబరు 7993485111 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈనెంబర్ 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. అదే విధంగా డయల్ 100, 112, 1930, 1098 నెంబర్లకు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు. నేరరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

ఐదేళ్లు దాటితే బదిలీనే..

(5వ పేజీ తరువాయి)

సచివాలయాల బాధ్యతలు నిర్వహిస్తారు. మిగులు సిబ్బందిని ఇతర మండలాలకు పంపిస్తారు. అవసరం లేదనుకుంటే అదే సచివాలయంలో పనిచేయవచ్చు. ఇప్పటికే సచివాలయాల్లో అందుకు అనుగుణంగా పోస్టింగ్‌లు ఖరారు చేశారు. ఇదే పోస్టింగ్‌లో ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగి ఉంటే వేరేచోటికి బదిలీ చేస్తారు. సదరు పోస్టింగ్‌కు ఇతర సచివాలయం నుంచి బదిలీ చేస్తారు. ఐదేళ్లు పూర్తికాకపోయినా కొన్నిచోట్ల సిబ్బందిని బదిలీచేసే అవకాశం ఉంది.

సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధం

సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అధికశాతం ఇతర ప్రాంతాలకు చెందినవారున్నారు. ఐదేళ్లు పూర్తి కావడంతో వారు సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు స ుముఖత చూపుతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వారిలో అధికశాతం మంది పక్కజిల్లాల వాసులున్నారు. ఐదేళ్లు పూర్తయినవారు సొంత జిల్లాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు చాలామంది యువత ఉండటంతో అ లాంటివారు ఇటీవల ఉద్యోగాలు సాధించినతరువాత పెళ్లిళ్లు చేసుకున్నారు. దీంతో భార్యఒకచోట.. భర్త మరోచోట ఉండటంతో వారంతా బదిలీలకు సిద్ధమవుతున్నారు.

దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించారు. వారు కోరుకున్న చోటుకి బదిలీ చేయనున్నారు. దృష్టిలోపం, వినికిడి, ఇతర సమస్యలున్న దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. సదరు ఉద్యోగి విజ్ఞాపన మేరకు బదిలీ చేయాలని నిర్ణయించారు. కోరుకున్నచోట ఖాళీగా ఉండాలి. ఇలా పలు మార్గదర్శకాలు సూచించారు. దీనికి అనుగుణంగానే బదిలీలు చేయాల్సి ఉంది. ఈ బదిలీలు మున్సిపాలిటీల వారీగానా, జిల్లా ప్రాతిపదికనా.. అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

సిఫార్సుల కోసం క్యూ

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే కార్యాలయాల వద్దకు క్యూ కడుతున్నారు. తమకు కావాల్సిన చోటుకి బదిలీ చేయించుకునేందుకు సిఫార్సు లేఖల కోసం వెళ్తున్నారు. అధికశాతం మంది పక్క జిల్లాకు చెందినవారు ఉండటంతో ఇక్కడి నుంచి సిఫార్సు తీసుకోవడం, ఇక్కడికి వచ్చేవారు కూడా స్థానిక ఎమ్మెల్యేల లేఖ కోసం వెళ్తున్నారు. మరికొంతమంది మండల, పంచాయతీ స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఐదేళ్ల తరువాత బదిలీలకు శ్రీకారం చుట్టడంతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి కేంద్ర కమిటీల పర్యటన

● నేషనల్ వాటర్ అవార్డ్సు, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీల రాక
● అధికారులతో డ్వామా పీడీ సమీక్ష

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి రెండు కేంద్ర కమిటీలు పర్యటించనున్నాయి. నేషనల్ వాటర్ అవార్డ్ కమిటీ, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీలు రానున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. కేంద్ర అధికారుల పర్యటనపై ఆదివారం స్థానిక డ్వామా కార్యాలయంలో పీడీ సమీక్షించారు. నేషనల్ వాటర్ అవార్డ్ కమిటీ ఈనెల 17న మధ్యాహ్నం జిల్లాకు చేరుకుంటుందని, అదే రోజు కలెక్టర్‌తో జిల్లాలో అమలు చేస్తున్న నీటి నిర్వహణకు సంబంధించిన పనులపై సమీక్షిస్తుందని తెలిపారు. 18, 19వ తేదీలలో క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పర్యటిస్తుందన్నారు. నేషనల్ వాటర్ అవార్డ్ కమిటీలో సెంట్రల్ వాటర్ కమిషన్ డీడీ శంకర్, శాస్త్రవేత్త గౌతమ్ ఉన్నారన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి నబనీతదాస్ నేతృత్వంలోని నేషనల్ మానిటరింగ్ కమిటీ ఈనెల 18, 19, 20, 21వతేదీలలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఉపాధి, వాటర్ షెడ్ పనులు, రికార్డులను పరిశీలిస్తుందని తెలిపారు. ఉపాధి కూలీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, చేసిన పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతారని వివరించారు. కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, సీబీ ఏపీడీ విజయ్‌కుమార్, ఫైనాన్స్ మేనేజర్ రాధా తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర కమిటీల పర్యటనపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

న్యూస్ బాక్స్

ఇస్కాన్‌లో భాగవత ప్రవచనాలు

ధర్మవరం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపం లో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం ఇస్కాన్ ధర్మవరం ధర్మప్రచారకులు శ్రీకృష్ణ మాధవదాస్ భాగవత ప్రవచనాలను వివరించారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువుదీరిన బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలను అందంగా అలంకరించి సంకీర్తనలు చేశారు. అనంతరం భాగవతంలో శ్రీకృష్ణుడి పాత్ర, ప్రవచనాలను భక్తులకు వివరించారు. అదేవిధంగా భక్తులు హరేకృష్ణ, హరేరామ సంకీర్తనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హస్తకళల అభివృద్ధికి కృషి

● కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్



కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): హస్తకళల అభివృద్ధికి కృషి చేస్తామని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ధర్మవరం పట్టణానికి వచ్చిన ఆయనకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తన స్వగృ హంలో తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను చిలకం మధుసూదన్‌రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం చిలకం మధు మాట్లాడుతూ... రాష్ట్రంలోని హస్తకళలకు, ఆ కళాకారుల అభ్యున్నతికి హరిప్రసాద్ కృషి అందరికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, రాజారెడ్డి, డిస్‌రాజు, ప్యాదిండి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లమీదపల్లిలో ఉచిత వైద్యశిబిరం

గాండ్లపెంట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలో ఆదివారం డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అన్ని వయస్సులకు చెందిన 115మందికి చికిత్సలు చేసి, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కదిరి రైల్వేస్టేషన్ రోడ్డులోని పాలెం ఆంజనేయులరెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఈతోడులో...

తనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఈతోడు గ్రామంలో ఆదివారం తిరుపతికి చెందిన తులసీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వేదత్రయ నీరోహా ఆసుపత్రికి చెందిన డాక్టర్లు నారే హేమారాణి, తులసీరామ్ ఆరోగ్య పరీక్షలు చేశారు. 120 మందికిపైగా రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. అవస రమైన వారిని శస్త్రచికిత్సల కోసం సిఫార్సు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కిష్టప్ప, రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కురుబ సంఘం నాయకుడికి పరామర్శ

ముదిగుబ్బ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేముల క్రాస్ కురుబసంఘం నాయకుడు బండి మల్లికార్జునను ఆదివారం కురుబ సంఘం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులు పరామర్శించారు. మలకవేముల క్రాస్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లారు. నెల లోపే మల్లికార్జున తండ్రి, కుమారుడు మరణించ డంతో ఆ కుటుంబాన్ని కురుబ సంఘం నాయకులు పరామర్శిం చారు. బండి మల్లికార్జునను పరామర్శించిన వారిలో కురుబ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కార్పొరేషన్ డైరెక్టర్ పాళ్యం కాటమయ్య, రాష్ట్ర ఈసీ మెంబర్ దివిటి సోమశేఖర్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గొట్లూరు అనిల్, కప్పల సుదర్శన్, గోపి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న పాలవ్యాన్‌ను ఢీకొన్న బైకు

● ఒకరికి గాయాలు

ధర్మవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న పాలవ్యాన్‌ను ఢీకొని ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని గూడ్‌షెడ్ కొట్టాలకు చెందిన నరేశ్ అనే వ్యక్తి ఆదివారం ద్విచక్రవాహనంలో ఇంటి వద్ద నుంచి చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో గాంధీనగర్ చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న పాలవ్యాన్‌ను నరేశ్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ధర్మవరం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మరో ముగ్గురికి...

కొత్తచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరకుంటపల్లికి వెళ్లే దారిలో దిచక్రవాహం ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. లోచర్ల గ్రామానికి చెందిన మారుతి, ఆయన కుమారులు దీక్షిత్ సాయి, రిత్విక్‌బాబు మరకుంటపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయం పొలం వద్ద నిలబడి ఉన్నారు. మరకుం టపల్లికి చెందిన వడ్డె అశోక్ గ్రామానికి వెళ్తూ వారిని ఢీకొన్నా డు. ఈ ప్రమాదంలో మారుతి, దీక్షిత్‌సాయి, రిత్విక్‌బాబుకు గాయాలయ్యాయి. ఇందులో దీక్షిత్‌సాయి తలకు బలమైన గాయమైంది. స్థానికులు వారిని కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమచికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. తండ్రి మారుతి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రీడాకారులకు టీ షర్టులు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడామైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉదయం కేసీసీ -ఎ జట్టు, బి జట్టు మధ్య మ్యాచ్ నిర్వహించారు. ఇందులో ఎ జట్టు 224 పరుగులుచేయగా, బి జట్టు లక్ష్యా న్ని ఛేదించింది. వీరిలో మను 73, గౌస్ 74, మోహన్ 42, షకీల్ 35 పరుగులతో రాణించారు. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో కేసీసీ ఎ జట్టు, అండర్ 14 జట్టు మధ్య మ్యాచ్ జరిగింది. అండర్ 14 జట్టు 40 ఓవర్లలో 187 పరుగులు చేయగా, ఎ జట్టు నిర్ణీత ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాధన పాఠశాల యజమాన్యం ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు టీషర్టులు అందించినట్లు కోచ్ నజీర్ తెలిపారు.

నీరు పారితే ప్రయాణం బంద్..!

● సోమావతి నదిపై తక్కువ ఎత్తులో వంతెనలు
● వర్షాకాలంలో వంతెనలపై నీటి ప్రవాహం
● ఇబ్బందులు తప్పవంటున్న సమీప గ్రామాల ప్రజలు



ఇనుగలూరు రహదారిలో తక్కువ ఎత్తులో ఉన్న వంతెన

ఓబుళదేవర చెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైతే చాలు ఆ గ్రామ ప్రజల్లో దిగులు మొదలవుతుంది. ప్రతియేటా వర్షాకాలంలో బాగా వర్షాలు కురిసి సోమావతి నదిలో నీరు ప్రవహిస్తే వంతెనలపై పారి పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు స్తంభిస్తాయి. దీంతో ఎ క్కడి గ్రామాల ప్రజలు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పాలకులు మారినా, వంతెన నిర్మాణ పనులు మాత్రం చేపట్టకపోవడంతో వెంకటాపురం, సున్నంపల్లి, ఇనుగలూరు తదితర ప్రాంతాల ప్రజలు కొన్నేళ్ల నుంచి అలాగే నెట్టుకొస్తున్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఉన్న నారప్పగారిపల్లి వద్ద సోమావతి నదిపై నిర్మించిన వంతెన ఎత్తులో లేదు. ఈ వంతెనపైనే వెంకటాపురం, రామిరెడ్డిపల్లి, బోగానిపల్లి, వీరప్పగారిపల్లి, బండకిందపల్లి, తుమ్మలకుంట్లపల్లి పంచాయ తీ ప్రజలు నిత్యం వెళ్తుంటారు. దీంతో సోమావతి నది పొంగి ప్రవహించి నప్పుడు ఆ నీరు వంతెనపై పారుతుంది. ప్రవాహం తగ్గేవరకు ఎక్కడి వారక్కడే ఉండాల్సిన పరిస్థితి. మరికొన్ని గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయంగా మరో దారి గుండా గమ్యాలు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనితో పాటు ఇనుగలూరు పంచాయతీ ప్రజల పరిస్థితి అలాగే ఉంది. ఇనగలూరు వంతెనపై నీరు ప్రవహిస్తే ఇనుగలూరు, గొల్లపల్లి ప్రజలకు బాధలు తప్పవు. ఇదిలా ఉండగా సోమావతి నదిపై సున్నంపల్లి వద్ద నిర్మించిన వంతెన గతంలో నీటి ఉధృతికి తెగింది. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ వంతెనపై సున్నంపల్లి, మలకవారిపల్లి, పెద్దగుట్లపల్లి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సోమావతి నది పొంగి ప్రవహించినప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

ఈ ఏడాదైనా వంతెన నిర్మించేరా?

ప్రతియేడు వర్షాకాలంలో సున్నంపల్లి వంతెన పరిస్థితి సమస్యగా మారుతోంది. గతంలో ఒకసారి నీటి ఉధృతికి వంతెన తెగింది. అలాగే గతయేడు సోమావతి నదిలో నీరు ఉధృతంగా ప్రవ హించడంతో ఆ ఉధృతికి సున్నంపల్లి వంతెన తెగింది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రానున్నది వర్షాకాలం. గతంలో మాదిరి వంతెన తెగ కుండా, ఈ యేడాదైనా శాశ్వత వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని సున్నంపల్లి పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. మండలంలోని నారప్పగారిపల్లి, ఇనుగలూరు వంతెనలు ఎత్తు తక్కువగా ఉన్నాయి. సోమవతి నది నీరు వాటిపై ప్రవహిస్తే సమీప గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వంతెనలపై నీటి ప్రవాహం తగ్గే వరకు ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించి పోతాయి. ప్రభు త్వం, ఉన్నతాధికారులు స్పందించి వంతెనల ఎత్తును పెంచి, ప్రజలకు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టండి



వర్షాకాలం మొదలైతే చాలు ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. సున్నంపల్లి వంతెన ఇప్పటికే రెండుమార్లు నీటి ఉధృతికి తెగింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు తాత్కాలిక మరమ్మతు లు చేపట్టారు. అయితే మునుముందు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ముందస్తుగా సున్నంపల్లి వంతెన శాశ్వత నిర్మాణం చేపట్టాలి.

-వీరాంజనేయులు, పెద్దగుట్లపల్లి

వంతెన ఎత్తు పెంచాలి..



మా గ్రామ సమీపంలో సోమావతి నదిపై నిర్మించిన వంతెన ఎత్తును పెంచాలి. ఎత్తు అతి తక్కువగా ఉండడంతో నదిలో చిన్నపాటి నీరు ప్రవహించినా రాకపోలకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన ఎత్తును పెంచి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి.

-రెడ్డిపల్లి రాజారెడ్డి, నారప్పగారిపల్లి

వికసిత భారత్‌లో భాగస్వాములు కావాలి

● బీజేపీ నాయకుల పిలుపు



వికసిత భారత్ కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో చేపట్టిన వికసిత భారత్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేసు పిలుపు నిచ్చారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఆదివారం బీజేపీ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ పిలుపు మేరకు వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి రహిత వివక్షలేని సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. మహిళల సాధికారితకు కృషిచేయాలన్నారు. ప్రధాని మోదీ పాలన స్ఫూర్తిగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, నాయకులు పోతుకుంట రాజు, నబీరసూల్, వడ్డే శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సోమ్లానాయక్, అనిల్,శారదమ్మ, నాగభూషణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. సంరక్షిద్దాం

నల్లచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి బీజేపీ ముస్లిం మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ అహమ్మద్, బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మల వేమనారాయణ పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లచెరువులో గీతా మందిరంలో ఆదివారం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధానిగా మోదీ 11సంవత్సరాలు పూర్తి చేసుకున్నం దుకు గుర్తుగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలన్నారు. అనంతరం స్థానిక గీతా మందిరంలో ప్రధాని మోదీ పేరుమీద మొక్క నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీటీ ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షమీవుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, మాజీ మంత్రి రాక

ఓబుళదేవర చెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో సోమ వారం నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమానికి బీకే ఎంపీ పార్థ సారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న పేరుమీద మండలకేంద్రంలో కల్యాణమండపం నిర్మాణానికి స్థలాన్ని వారు పరిశీలించనున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు జెరిపిటి ఆంజనప్ప తెలిపారు. ఎంపీ, మాజీ మంత్రి పర్యటనను విజయవంత చేయాలని వారు ఆదివారం ఓ ప్రకటనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను వారు కోరారు.

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిద్దాం

● సీపీఎం, సీఐటీయూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకచ్చిన లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిద్దామని సీపీఎం, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రానికి సమీపంలోని సర్వే నంబర్ 793లో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో ఆదివారం సీపీఎం, సీఐటీ యూ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవిల్ నరసింహులు మాట్లా డుతూ... పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వలన కార్మికులకు జరిగే నష్టాలను వివరించారు. వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కన్వీనర్‌గా ఒంట్టిదు వేమన్న, కోకన్వీనర్‌గా నరసింహారెడ్డితో పాటు 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పనిచేయనున్నట్లు చెప్పారు. కార్యక్ర మంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రామక్రిష్ణ, రైతు సంఘం నాయకుడు రమణ, జిల్లా కమిటీ స భ్యులు ఎస్‌వీ రమణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, రైతు సంఘ నాయకులు చలపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం జరిగింది. మండల పరిధిలోని మండ్లిపల్లి మిట్ట వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. 27 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గత స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలను సందర్శించారు. అప్పటి ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, వేమనారాయణ, శంకర్, కరీ ముల్లాను ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పారిశుధ్యం... అధ్వానం

● పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త
● వెదజల్లుతున్న దుర్గంధం
● ఇబ్బంది పడుతున్న స్థానికులు



ఆర్డీటీ కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన వేసిన చెత్త

ముదిగుబ్బ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు వీధుల్లో పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా చెత్త ఎక్కడ పడితే అక్కడ గుట్టలు గుట్టలుగా పేరకుపోయింది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, చాలా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా వాసవీనగర్, రైల్వే గేట్ కొట్టాల, సాయినగర్, వాసవీ కళ్యాణ మండపం పరిసరాలు, ఆర్డీటీ కార్యాలయం వద్ద తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. కదిరి రోడ్డు, అనంతపురం రోడ్డు పక్కన పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. ఆ చెత్తకుప్పల్లో పందులు, కుక్కల స్వైర విహారం అధికంగా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. చెత్త మురిగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఆ కంపును భరించలేకపోతున్నామని అంటున్నారు. అంతే కాకుండా సాయినగర్‌లో మురుగు గుంటలు ఉండడంతో దోమలు విజృంభి స్తున్నాయని, ఫలితంగా జ్వరాల భారిన పడుతతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



దర్శినమల వైపు ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ఆటో

ధర్మవరంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆటోలలో ఇష్టారాజ్యంగా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రమాదం అని తెలిసినా అవేవీ పట్టించుకోకుండా ఆటో డ్రైవర్లు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని నేలకోట, బిల్వంపల్లి, దర్శినమల, నడిమిగడ్డపల్లి గ్రామాలకు వెళ్లే ఆటోలలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఆ గ్రామాలకు వెళ్లే రహదారిలో మలుపులు, గుంతలు ఉన్నాయి. అయినా ఆటోడ్రైవర్లు ఓవర్‌లోడ్‌తో ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నారు. ఆటో పైన కూర్చున్న ప్రయాణికులు ఏ మాత్రం పట్టువీడినా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. గతంలో ఆటోలలో ఓవర్‌లోడ్‌తో వెళుతూ ప్రమాదాల భారినపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు స్పందించి ప్రమాదాల జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత విమర్శలు తగవు

● వైసీపీ శ్రేణులకు టీడీపీ నేతల సూచన

నల్లచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, ఆ పార్టీనాయకులు టీడీపీ నాయకులపైన వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు. నల్లచెరువులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు నాయకులు మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు చేసుకున్న తరువాత టీడీపీ మండల మాజీ కన్వీనర్ నాగభూషణ నాయుడు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని గాలికొదిలేశారని అన్నారన్నారు. అయితే శనివారం సాయంత్రం వైసీపీ మండల కన్వీనర్ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. పార్టీలకు అతీతంగా అందుతున్న పథకాలపై బురదచల్లే కార్యక్రమాలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, మాజీ కన్వీనర్ నాగభూ షణం నాయుడు, మాజీ సింగల్ విండో డైరెక్టర్ అశ్వత్థనాయుడు, నాయకులు దేవేంద్రగౌడ్, రమణారెడ్డి, రమేష్, కిరణ్‌కుమార్, బషీర్ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంతలు



కూడలిలో రోడ్ల మధ్యలో పడ్డ గుంతలు

కొత్తచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నెహ్రూ కూడలిలోని రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇతర ప్రాంతాల నుంచి పలువురు పుట్ట పర్తికి, జిల్లా కేంద్రానికి అధికసంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు మధ్యలో ఉన్న గుంతలు వాటి దగ్గరకు వచ్చే వరకు కనబడవు. వాటి దగ్గరకు వచ్చాక వాహన దారులు సడన్ బ్రేకులు వేస్తున్నారు. సడన్ బ్రేకు వేయడం వల్ల వాహనం అదుపు తప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. కొంత మందికి కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలు ఉన్నాయని వాహన దారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి నెహ్రూ కూడలిలో ఏర్పడిన గుంతలు పూడ్చాలని ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

సత్ప్రవర్తన లేకపోతే చర్యలు: సీఐ

తాడిమర్రి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించాలని, అలాగాకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు అన్నారు. ఆయన ఆదివారం తాడిమర్రి మండలంలోని రౌడీ షీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. ఆయన ఆదివారం మండలపరిధిలోని పత్యాపురం గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ గొడవలకు దూరంగా ఉండి కుటుంబ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గ్రామాలపై పోలీస్ నిఘా ఉందని, ఎవరైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

డ్రైనేజీపై కల్వర్టులు లేక ఇబ్బందులు



కల్వర్టు లేని మురుగు కాలువ

కొత్తచెరువు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని వేణుగోపాల్‌నగర్‌లో ఇటీవల వీధుల్లో ప్రభుత్వం ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. కాంట్రాక్టర్లు సీసీరోడ్ల నుంచి వీధుల్లోకి దాటుకునేందుకు వీలుగా డ్రైనేజీల కాలువలపై కల్వర్టులు నిర్మించక పోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద కల్వర్టు వేయకపోవడంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఇబ్బం దులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు కాలువను దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాలువలపై కల్వర్టులు నిర్మించాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధుల్లోకి వెళ్లే ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలపై కల్వర్టులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ప్రత్యేక పూజలు



అమరాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేక పూజలు అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వర స్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షేశ్వరస్వామిలను ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్ స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

యోగాతో ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న పట్టణ ప్రజలు

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని శిక్షకులు అన్నారు. పట్టణంలోని వివిధ యోగా శిక్షకులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యోగా చేయడంవల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరో గ్యం, మానసిక ప్రశాంతత ఉండాలంటే యోగాను అలవాటుచేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, ప్రజలు హాజరయ్యారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

మడకశిర టౌన్, జూన్15(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం అని, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణంలో ఐదు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు అన్న పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఏడాది పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. రమేష్‌రెడ్డి, ఈరలక్కప్ప, జి.రంగేగౌడ్, వజ్రబాస్కర్‌రెడ్డి, ఆనంద్‌రంగారెడ్డి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

కొత్త మోటార్ల ఏర్పాటు



బోరు మోటారును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చోట్ల కొత్తమోటార్లను ఏర్పాటు చేసినట్లు మనిసిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలువార్డుల్లో బోరు బావులకు కొత్త మోటార్లు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కరువు నిధుల ద్వారా మోటార్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రయత్నిస్తామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌తోపాటు, బోరుబావులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు తొలగించండి

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి ప్రాంతంలో ఉన్న బెల్ట్‌షాపును తొలగించాలంటూ ఆ ప్రాంతానికి చెందిన మహిళలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. బెల్ట్‌షాపువద్ద కొంతమంది తాగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో బెల్ట్‌షాపు చుట్టూ నివాస ప్రాంతాలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే షాపును ఎత్తివేయాలని కోరారు. దీనిపై ఎక్సైజ్ సీఐకు సమాచారం ఇవ్వగా మహిళలు ఫిర్యాదు చేసిన ప్రాంతాన్ని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య పరిశీలించారు. అక్కడ మద్యంలేకపోవడంతో ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు.

పరిగిలో చోరీ



చెల్లాచెదురుగా పడిన వస్తువులు

పరిగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సేవామందిరంలోని ఆర్పీజీటీ లే అవుట్‌లో రామచంద్ర అనే వ్యక్తి ఇంటిలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. బాధితుడి సమాచారం మేరకు భార్య పవిత్ర కౌన్సిలింగ్ నిమిత్తం పుట్టపర్తికి వెళ్లగా తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి ఖంగుతిన్నారు. హుటాహుటిన లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగల కొట్టి అందులో ఉన్న నాలుగు తులాల బంగారం దుండగలు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



నాడు

రోడ్డు నిర్మించక ముందు..



నేడు

సీసీ రోడ్డు నిర్మాణం తరువాత..

నెరవేరిన దశాబ్దాల కల..!

- మంత్రి చొరవతో కందుకూర్లపల్లి రోడ్డుకు మోక్షం
- 1.25 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం

రొద్దం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రొద్దంకు కూతవేటు దూరంలో ఉన్న కందుకూర్లపల్లి గ్రామానికి దశాబ్దాలుగా రోడ్డు లేదు. ఎన్నేళ్లగా రహదారి లేని ఆ గ్రామస్థులకు రూ.1.25కోట్ల నిధులు మంజూరుచేసి వారి దశాబ్దాల కలను మంత్రి సవిత నెరవేర్చారు. వైసీపీ హయాంలో అప్పటి పాలకులు అదిగో ఇదిగో రోడ్డు వేస్తామని ఐదేళ్లు కాలయాపన చేశారు. దీంతో కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లి గ్రామస్థులు విసిగి వేసారిపోయారు. 2024ఎన్నికల్లో రెండు గ్రామాల ప్రజలు టీడీపీకి అత్యధిక మెజార్టీని ఇచ్చారు. దీంతో మంత్రి సవిత ఇటీవలే రొద్దం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి కందుకూర్లపల్లి గ్రామంవరకు 1.5 కి.మీ సీసీ రోడ్డును వేయించారు. దీంతో గ్రామస్థుల ఆనందానికి అవధులులేకుండా పోయాయి. అయితే చిన్నకోడిపల్లి గ్రామస్థులకు కల నెరవేరకపోవడంతో కొంత అసంతృప్తిగా ఉన్నారు. పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి చిన్నకోడిపల్లి మీదుగా చోళేమర్రికి రోడ్డునిర్మాణం చేపట్టాల్సి ఉంది. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినా పెన్నానది పరవళ్లు తొక్కితే చిన్నకోడిపల్లి గ్రామస్థులు ఎటూవెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం భారీ వర్షాలతో రెండు నెలలపాటు పెన్నానది ఉప్పొంగగా రొద్దంకు రాకపోకలు స్తంభించాయి. నిత్యావసర వస్తువులు దొరక్క చిన్నకోడిపల్లి గ్రామస్థులు చాలా ఇబ్బందులుపడ్డారు. పాఠశాల విద్యార్థులకు సైతం చదువులేక నానా తంటాలు పడ్డారు. చిన్నకోడిపల్లి గ్రామానికి బ్రిడ్జి, రోడ్డు వేయాలని గ్రామస్థులు మంత్రి సవితను కోరుతున్నారు.

మంత్రికి రుణపడి ఉంటాం



కందుకూర్లపల్లి గ్రామానికి రోడ్డువేసి మంత్రి సవిత పుణ్యం కట్టుకున్నారు. మా గ్రామస్థులు ఎప్పుడూ రుణపడి ఉంటాం. దశాబ్దాలుగా రోడ్డుకోసం ప్రయత్నం చేసి నీరసించాం. మంత్రి మా కలను సాకారం చేశారు. చిన్నకోడిపల్లి గ్రామానికి బ్రిడ్జి, రోడ్డును వేయించాలి.

- తిప్పన్న, కందుకూర్లపల్లి

ఎన్నో ఏళ్ల కల సాకారమైంది



మా గ్రామానికి రోడ్డువేయించుకోవాలన్న శతాబ్దాల కల మంత్రి సాకారం చేశారు. రోడ్డు లేక గుంతలతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రోడ్డు పూర్తికావడంతో మా గ్రామస్థులు సంతోషంగా ఉన్నారు.

- హనుమన్న, కందుకూర్లపల్లి

చదువుతో ఏదైనా సాధ్యం: ఎంపీ



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎంపీ పార్థసారథి

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. ఆదివారం పాండురంగనగర్‌లోని కనకదాస కల్యాణమండపంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ఉద్యోగ, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడుతూ కురుబ కులస్థులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. చదివితేనే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి ఆస్కారం ఉంటుందన్నారు. బాగా చదివిన వారికి ఉద్యోగాలు వాటంతటవే వస్తాయన్నారు. ఒకప్పుడు ఉద్యోగం కోసం వెతుకులాడే పరిస్థితి, కానీ చదువులో బాగా రాణిస్తే ఉద్యోగమే తమవద్దకు వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. పరిశ్రమలు బాగా వస్తే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత శ్రీరంగరాజులపల్లి



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న బంగారు చంద్ర

పరిగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో శ్రీరంగరాజుపల్లి జట్టు విజేతంగా నిలిచింది. బీజేపీ సీనియర్ నాయకుడు బంగారుచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. పరిగి, శ్రీరంగరాజులపల్లి ఫైనల్స్‌లో తలపడగా శ్రీరంగరాజులపల్లి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలు, ట్రోఫీలు అందజేశారు. ఆర్గనైజర్ ఉదయ్, అరుణ్, సంజీవ్‌మూర్తి, నదీమ్, అలీమ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై మెరుపుదాడి

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణ పరిధిలో యథేచ్ఛగా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపుదాడి చేశారు. దాడుల్లో 20మందిని అదుపులోకి తీసుకుని రూ.1,94,650 స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. రాబడిన సమాచారంతో సీఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్దన్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులుచేయగా ముద్దిరెడ్డిపల్లి, పరిగి రోడ్డులో పేకాట ఆడుతున్న 20మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు కొంతకాలంగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూదరుల బైండోవర్

సోమందేపల్లి, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి జూదమాడుతున్న 17మందిపై ఆదివారం బైండోవర్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వారికి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పేకాటకు బానిసైన కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సోమందేపల్లిలో శిబిరాలు ఏర్పాటుచేసుకుని జూదమాడుతుండగా గతంలో పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. దీంతో 17మంది జూదరులకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ కేసు నమోదుచేశామన్నారు. సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరుస్తామన్నారు.

నేడు యోగా దినోత్సవంలో పాల్గొననున్న మంత్రి

పెనుకొండ రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : అంతార్జీతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పాల్గొనున్నట్లు మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, ఈశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 6-30 నుంచి 8 గంటల మధ్యలో కియ పరిశ్రమ ప్రాంగణంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం 10-30 గంటలకు ఫైర్‌స్టేషన్ రోడ్డులోని డంపింగ్‌యార్డ్‌ను పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని వారు కోరారు.

'శ్రీకృష్ణుడు.. జగద్గురువు..'



గౌనివారిపల్లిలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

గోరంట్ల, జూన్15 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడు జగద్గురువు అని త్రైత సిద్ధాంత ప్రబోధా సేవా సమితి అధ్యక్షుడు ఆదినారాయణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని గౌనివారిపల్లిలో పౌర్ణమి విశిష్టతను ప్రజలకు ఆయన వివరించారు. ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల గురించి ప్రచారం చేశారు. శ్రీకృష్ణుడు మాత్రమే జగద్గువురుగా ఎందుకు పూజించాలో, గొప్పతనాన్ని వివరించారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అనాలన్నారు. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండడం వల్ల గురుపౌర్ణమిగా నిర్ణయించి, శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా భావించి పూజ చేయాలన్నారు. సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

కొత్తచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరకుంట పల్లికి వెళ్లే దారిలో దిచక్రవాహం ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. లోచర్ల గ్రామానికి చెందిన మారుతి, ఆయన కుమారులు దీక్షిత్ సాయి, రిత్విక్‌బాబు మరకుంటపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయం పొలం వద్ద నిలబడి ఉన్నారు. మరకుం టపల్లికి చెందిన వడ్డె అశోక్ గ్రామానికి వెళ్తూ వారిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మారుతి, దీక్షిత్‌సాయి, రిత్విక్‌బాబుకు గాయాలయ్యాయి. ఇందులో దీక్షిత్‌సాయి తలకు బలమైన గాయమైంది. స్థానికులు వారిని కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. తండ్రి మారుతి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

పెనుకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అంగనవాడీ వర్కర్ల పిల్లలకు, వివిధశాఖలలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నిబంధనల పేరుతో పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందుకు మించిన షరతులు విధించి లబ్ధిదారులకు నగదు కూడా తగ్గించడం సరైంది కాదన్నారు. గతంలో రూ.15వేలు ఖాతాలో జమ అయ్యేదని నేడు రూ.2వేలు తగ్గించి రూ.13వేలు మాత్రమే జమ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అడ్డుగోలు నిబంధనలతో తొమ్మిది లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా అర్హులైన అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ, మల్లికార్జున, వెంకటరాముడు పాల్గొన్నారు.



బొలెరో వాహనంపై విరిగిపడ్డ చెట్టు

గాలికి విరిగిపడ్డ చెట్టు, విద్యుత్ స్తంభం



విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టమీదపల్లి గేటు వద్ద ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు విద్యుత్ స్తంభం, చెట్టు విరిగిపడ్డాయి. అయితే చెట్టువద్ద ఆగిఉన్న టెంపో, బొలేరోవాహనంపై కొమ్ములు పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కార్పెంటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నూతన కమిటీ సభ్యులతో సీఐ శేఖర్

గోరంట్ల, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్పెంటర్లు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో తమ పిల్లలను బాగా చదివిస్తూ, కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని సీఐ శేఖర్ సూచించారు. స్థానిక షాదీమహల్‌లో ఆదివారం జరిగిన కార్పెంటర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మికశాఖద్వారా లేబర్ కార్డులు పొంది, ప్రతి ఒక్కరూ ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్పెంటర్ల సంఘాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అశ్వత్థరెడ్డి, అజంతుల్లా, మండల కమిటీ అధ్యక్షులు రియాజ్, ఉపాధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఫారూక్, సంయుక్త కార్యదర్శి ముజామిల్, కోశాధికారిగా అక్బర్, ఉబేదుల్లా, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు అన్నారు.

తాగుబోతు వీరంగం



మహిళలతో గొడపడుతున్న తాగుబోతు

సోమందేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లాపల్లి గ్రామంలో ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. కనిపించినవారిపైకెళ్లి దుర్భాషలాడూఊ గొడవకు దిగాడు. నచ్చజెప్పడానికి వచ్చిన వారిని తిడుతూ అందరినీ కాసేపు హడలెత్తించాడు. విసుగు చెందిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ మురళి తాగుబోతును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): హిం దూపురం రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి(48)ని రైల్వే పోలీసులు ఆదివారం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనివద్ద ఉన్న ఆధారాలను బట్టి మడకశిర ప్రాంతమని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వాడని భావిస్తున్నారు. హిందూపురం పట్టణానికి చెందినవాడై ఉంటాడని రైల్వేపోలీసులు అనుమానిస్తున్నారు.

చెత్తకుప్పల తొలగింపు



నగర పంచాయతీ కార్యాలయం వద్ద చెత్తను తొలగించిన దృశ్యం

మడకశిర టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా పరిసరాలు పరిశుభ్రం చేయకపోవడంతో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధ్వానంగా పారిశుధ్యం కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పట్టణంలో చెత్తాచెదారాలను శుభ్రం చేయించారు. అక్కడక్కడ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ వేసి పరిశుభ్రం చేశారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

నల్లచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యాన్ని కాపా డాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి బీజేపీ ముస్లిం మో ర్చా జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ అహమ్మద్, బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మల వేమనారాయణ పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లచెరువులో గీతా మందిరంలో ఆదివా రం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధానిగా మోదీ 11సంవత్సరాలు పూర్తి చేసుకున్నం దు కు గుర్తుగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలన్నారు. అనంతరం స్థానిక గీతా మందిరంలో ప్రధాని మోదీ పేరుమీద మొక్క నాటారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా పాండురంగప్ప



పాండురంగప్ప



రవిభూషణ్

రొళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా తనను నియమించినట్లు వక్కళిగ సాధికార సమతి కన్వీనర్ వీఎం పాండురంగప్ప ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చిలమత్తూరు మండలం పరిశీలకుడిగా ఎస్ రవిభూషణ్‌లను ఎంపిక చేశారన్నారు.